ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

- 5 నుంచి ఈవీఎంల మొదటి దశ తనిఖీ
- 8న తుది ఓటరు జాబితా ప్రచురణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా తయారీ, ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీపై రాజకీయ పార్టీల నాయకులతో సమీకృత కలెక్టరేట్‌లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 5 నుంచి ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ ప్రారంభం కానుందన్నారు. ఈసీఐఎల్ ఇంజినీర్లు, పార్టీల నాయకుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ తనిఖీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. 1 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు కాని వారు ఎవరైనా ఉంటే గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. డబుల్, చనిపోయిన వారి ఓటు హక్కు జాబితాలో లేకుండా చూడాలన్నారు. ఓటరు జాబితా తయారీ నిరంతర ప్రక్రియ అని, ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్ఆర్-2024 తుది ఓటరు జాబితా ఈ నెల 8న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత కాపీలను నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కలెక్టరేట్, ఆర్డీ వో కార్యాలయాల్లో ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, తహసీల్దార్ షరీఫ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీ-హబ్‌కు అవార్డు హర్షణీయం

జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్ రాష్ట్రంలోనే ఉత్తమ సేవల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని కలెక్టర్ అనురాగ్ జయంతి కొనియాడారు. 2023లో మొత్తం 79,365 మంది రోగులకు 2,54,410 వైద్య పరీక్షలు చేసినందుకుగాను ఉత్తమ సేవల విభాగంలో రాజన్నసిరిసిల్ల టీ-హబ్ ప్రథమ స్థానం పొందగా జనవరి 26న టీ-హబ్ కోఆర్డినేటర్ రాంప్రసాద్ మెమెంటో స్వీకరించారు. రాజన్నసిరిసిల్ల టీ-హబ్ సిబ్బంది శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీ-హబ్‌కు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కడంపట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేసి, ఇందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఇక్కడ ప్రభుత్వ జనరల్ దవాఖాన పర్యవేక్షకుడు సంతోష్, జిల్లా దవాఖాన పర్యవేక్షకుడు మురళీధర్‌రావు, వైద్యులు మనీష, శ్వేత, క్రాంతిరేఖ, కోఆర్డినేటర్ రాంప్రసాద్, హారిక, జనార్దన్, సత్యనారాయణ, శ్వేత పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానీయవద్దు

రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రానీయవద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన సందర్భంగా జిల్లాలోని ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి శుద్ధి మొదలు ఇంటింటికీ సరఫరా అయ్యేదాకా ఎలాంటి సమస్యలు ఉన్నాయో తనిఖీ చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు.

మంత్రి సీతక్క సమీక్ష..

అంతకుముందు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మంత్రి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు ములుగు జిల్లా నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కలెక్టర్లు ప్రత్యేకాధికారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీనివాస్, టెక్స్‌టైల్ ఏడీ సాగర్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 3: విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగత విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకు హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, హెచ్ఎం భాగ్యరేఖ, ఫోరం అధ్యక్షుడు రెడ్డి రవి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

రుద్రంగి, ఫిబ్రవరి 3: రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మానాల జడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థి అజయ్ డీఈవో చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నాడు. రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు అర్హత సాధించిన అజయ్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

దర్శనం పేరిట కుచ్చుటోపి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 3: ఎములాడ రాజన్న క్షేత్రంలో పలువురు ఆలయ సిబ్బంది అత్యుత్సాహం చూపుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని, ప్రత్యేక దర్శనం చేయిస్తామని చెప్పి, వేలకువేలు దండుకొని ఉడాయిస్తున్నారు. శనివారం ఇదే తరహాలో భక్తుడి నుంచి రూ.3వేలు తీసుకొని పరారు కావడం చర్చనీయాంశమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టుభూత్కూరుకు చెందిన మాచర్ల నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న క్షేత్రానికి వచ్చాడు. దర్శనం వివరాల కోసం పీఆర్వో కార్యాలయానికి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని అడిగాడు. సదరు వ్యక్తి అభిషేకం టిక్కెట్లు ఇప్పిస్తానని, దర్శనానికి కూడా తీసుకువెళ్తానని నమ్మించి రూ.3వేలు వసూలు చేశాడు. ముందుగా దర్శనం చేయిస్తానని తీసుకెళ్లి భక్తులతో రద్దీగా ఉన్న ప్రాంతంలో వదిలేసి అక్కడి నుంచి కనిపించకుండా పోయాడని నరేశ్ ఆవేదనతో చెప్పాడు. పూర్తిస్థాయి ఈవోను నియమిస్తే ఇలాంటి ఘటనలకు చెక్‌పెట్టవచ్చని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతాం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

వేములవాడ, ఫిబ్రవరి 3 : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని ప్రభు త్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. శని వారం వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో జరిగిన వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేములవాడ నియోజకవర్గంతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు వేములవాడ పట్టణ అభి వృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన వీటీ డీఏ సమావేశం నిర్వహించామని, వేములవాడ అభి వృద్ధికి రూ.30 కోట్ల ప్రభుత్వం కేటాయించిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వేములవాడ నియోజక వర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ లభి ంచే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణా ధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

శిబిరం మొదలైంది...ట్యూబ్‌లు వచ్చినయ్..

కదిలించిన 'విష జ్వరాలపై విలవిల, టీ హబ్ సేవలపై నీలినీడలు' — **'నమస్తే' ఎఫెక్ట్**

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: కొన్ని రోజులుగా పదిర గ్రామం విషజ్వరాల బారిన పడి విలవిలలాడుతుండగా విషజ్వరాలతో విలవిల పేరున ఓ వార్త, సర్కారు దవాఖానలో రక్త పరీక్షలు చేసేందుకు ట్యూబ్‌ల కొరత , టీ హబ్ సేవలపై నీలినీడలు పేరిట శనివారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఊరంతా సర్వే....

పదిరలో 1260 మంది జనాభా ఉండగా వైద్య సిబ్బంది 7 బృందాలుగా ఏర్పడి 1016 మంది ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. రెండు ఇండ్లలో లార్వాను గుర్తించి 158 మందికి వైద్య పరీక్షలు చేశారు. 8 మందికి జ్వరాలున్నట్లు గుర్తించి వారికి ర్యాపిడ్ టెస్టులు చేశారు. 14 మంది జ్వరం బారిన పడిన వారికి దగ్గరగా ఉన్నందున వారికి రక్త పరీక్షల కోసం టీహబ్‌కు పంపారు. అనంతరం రక్తనమూనాలను సేకరించేందుకు 50 ట్యూబ్‌లు హాస్పిటల్‌కు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు.

పదిరలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డెంగీ పరీక్షలు సర్కారులోనే...

డెంగీకి సంబంధించిన ఎలీషా పరీక్ష కేవలం జిల్లా దవాఖానలోనే జరుగుతుందని ఇన్‌చార్జి డీఎంఎచ్‌వో తెలిపారు. రోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెబుతున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు చెప్పి, డెంగీగా భయపెడితే తమకు సమాచారం అందించాలని కోరారు. టీహబ్ ల్యాబ్ ఇన్‌చార్జి రాంప్రసాద్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట సీఎచ్‌సీకి 50 ట్యూబ్‌లు పంపామని చెప్పారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

నమస్కరిస్తున్న నెదర్లాండ్ మహిళ

సతీందర్‌ను సత్కరిస్తున్న ఆలయ ఏఈవో

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 3 : త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా లత తిరుమల, శ్రీలత, పద్మలత, వెన్నెల, మాలతి, వాణి బృందం, కొరిడె నరహరిశర్మ, సతీశ్ సంగీత కచేరీ, శ్రీరాంభట్టార్ భాగవతార్ హరికథ, రాఘవేందర్ రామ్మూర్తి తబల కచేరి భక్తులను భక్తిరస సంద్రంలో ముంచివేశాయి. భద్రాచలంకు చెందిన రాగమయి కూచిపూడి ప్రదర్శన ఆనందడోలికల్లో ఓలలాడించింది. ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో నెదర్లాండ్‌కు చెందిన సద్గురు జగ్గీ వాసుదేవ్ ఈషా ఫౌండేషన్ కార్యకర్త శ్రీమతి సుసాన్ సమాధానీ పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

శాస్త్రీయ భక్తి సంగీతంతో సమ్మేళనమైన సంకీర్తనావృతాన్ని అందించడానికి వచ్చిన కళాకారులు తమదైన ఆలాపనలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ధర్మపురికి చెందిన సంగనభట్ల కిషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని రాయబారం, శ్రీ లక్ష్మీనర్సింహ నాట్యమండలి వారి పౌరాణిక నాటకప్రదర్శన ఆద్యంతం రంజింపజేసింది. అద్భుతంగా వ్యాఖ్యానం చేసిన మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య, ఉత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్యశర్మ, వేములవాడకు చెందిన సంగీత కళాకారులను ఆలయ ఏఈవో శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. సన్మానించారు.

కేసీఆర్ పాలనలోనే గ్రామాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

తంగళ్లపల్లి సర్పంచ్, పాలకవర్గాన్ని జ్ఞాపికలను అందించి,సన్మానం చేస్తున్న ఎంపీపీ మానస, ప్యాక్స్ వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి

తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3: కేసీఆర్ పాలనలో తెలంగాణ గ్రామాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని తంగళ్లపల్లి ఎంపీపీ మానస పేర్కొన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో సిరిసిల్ల సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జాగృతి మండలాధ్యక్షుడు రామాగౌడ్, రోజా, ఆనందం, శ్రీనివాస్, రమేశ్, బాల్‌రెడ్డి, బండి జగన్, సత్యనారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, కిష్టారెడ్డి, గంగరాజు, బాలయ్య, రామచంద్రం, రాజు, అబూబాకర్, ఆంజనేయులు ఉన్నారు.

కఠినమైన శిక్షలతోనే నేరాలు తగ్గుముఖం

-అదనపు ఎస్పీ చంద్రయ్య

మాట్లడుతున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 3: నేరం చేసిన వారికి న్యాయస్థానంలో కఠినంగా శిక్ష పడినప్పుడే నేరాలు తగ్గుముఖం పడుతాయని అదనపు ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేర నిరోధన, నేర పరిశోధన అనే అంశాలు విధి నిర్వహణలో అత్యంత కీలకమైనవని, ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టినప్పుడే నిందితులకు కఠిన శిక్షలు పడుతాయన్నారు. కన్విక్షన్ రేటు పెంచడానికి, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తూ నేరస్తులకు శిక్షలు పడేలా చేడయంలో నిర్వహించాల్సిన విధి విధానాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వివరించారు. ఇక్కడ డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అడిషనల్ పీపీ లక్ష్మీప్రసాద్, సిరిసిల్ల సబ్ కోర్టు అడిషనల్ పీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శనివారం రేపాకలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఈ వేదిక మంచి అవకాశమన్నారు. ఈ క్రీడలు రెండు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దాస సుధాకర్, ఎంపీటీసీ సుమలత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

వేములవాడ, ఫిబ్రవరి 3: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని వేములవాడ సబ్ కోర్టు న్యాయమూర్తి సత్తు రవీందర్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేములవాడ, సిరిసిల్ల బార్ అసోసియేషన్ సభ్యులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను సీనియర్ సబ్ కోర్టు న్యాయమూర్తి రవీందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ ప్రారంభించి మాట్లాడారు. సిరిసిల్ల న్యాయవాదులు 8 ఓవర్లలో 102 పరుగులు చేసి వేములవాడ న్యాయవాదులపై గెలుపొందారు. 47 పరుగులు చేసిన కేసరి శ్రీనివాస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నారు. విజేతలకు న్యాయమూర్తులు రవీందర్, ప్రవీణ్ బహుమతులు అందజేశారు. ఇక్కడ ఏజీపీ సదానందం, వేములవాడ, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, లక్ష్మణ్, కార్యదర్శులు దివాకర్, అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు తిరుమలాగౌడ్ , విద్యాసాగర్‌రావు , మ్యాచ్ ఆర్గనైజర్ జీవన్ ఉన్నారు.

విజేతలకు కప్ అందజేస్తున్న న్యాయమూర్తి రవీందర్

షీ టీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 3: జిల్లాలోని మహిళలు, విద్యార్థినులు షీ టీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం ఈ సంవత్సరంలో షీ టీం నిర్వహించిన కార్యక్రమాలను, వచ్చిన ఫిర్యాదులను వెల్లండిచారు. విద్యార్థులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 6 ఎఫ్ఐఆర్లు, రెండు పెట్టి కేసులు నమోదు అయినట్లు వివరించా రు. మహిళలు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా 817126-56425/ డయల్ 100కి కాల్ చేసి ఫిర్యాదు చేయవవచ్చని సూచించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి

వేములవాడ, ఫిబ్రవరి 3: ప్రైవేట్ లాడ్జిలు, అద్దె గదుల నిర్వాహకులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వేములవాడ పట్టణ సిఐ కరుణాకర్ సూచించారు. శనివారం వేములవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మట్లాడారు. గదులు అద్దెకు ఇచ్చే సమయంలో ఫొటో, ఆధార్ కార్డు, ఇతరత్రా వాటిని జిరాక్స్ రూపంలో తీసుకొని నెలరోజుల వరకైనా భద్రపరచాలని చెప్పారు. రికార్డులో పూర్తి వివరాలు సెల్‌ఫోన్ నంబర్ సహా నమోదు చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ వేములవాడ రూరల్, చందుర్తి సీఐలు కృష్ణ కుమార్, కిరణ్ కుమార్, ఎస్‌లు మారుతి, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీకాంత్, అంజయ్య, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు

గాంధీ చౌక్, ఫిబ్రవరి 3: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి రెండు రోజుల జైలుతో పాటు 9 మందికి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పునిచ్చారు. పట్టణ పరిధిలో గత 15 రోజుల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 15 మంది పట్టుబడ్డారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా ఆరుగురికి 2 రోజుల జైలు, రూ.3వేల చొప్పున జరిమానా, 9 మందికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

మానవహక్కుల కమిషన్ వరకు పాదయాత్ర

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ తనను మోసం చేశాడని సిరిసిల్లకు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి పాదయాత్రగా వెళ్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్‌లో పాదయాత్ర ఫ్లెక్సీని ప్రదర్శించి మాట్లాడారు. లగిశెట్టి వద్ద ఎన్నికల్లో తాను పీఆర్వోగా పనులు చేశానన్నారు. చేసిన పనికి డబ్బులు ఇవ్వమంటే బెదిరించారని ఆరోపించారు. ఈ విషయంపై సిరిసిల్ల ఠాణాలో ఫిర్యాదు చేయగా లగిశెట్టి , మహేశ్, కిరణ్‌పై కేసులు నమోదు చేశారన్నారు. దీనిపై చర్యలు తీసుకోకపోవడంతో మానవ హక్కుల కమిషన్ వరకు పాదయాత్ర చేపట్టినట్లు వెల్లడించారు.

మండెపల్లి గ్రామాధ్యక్షుడికి కేటీఆర్ శుభాకాంక్షలు

రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కేటీఆర్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3: తంగళ్లపల్లి మండలం మండెపల్లి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు డాక్టర్ నక్క రవికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నక్క రవి తన పుట్టిన రోజు పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ రవికి స్వీటు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సింగిల్‌విండో చైర్మన్ దేవదాస్‌గౌడ్, డాక్టర్ దేవరాజు, నేతలు ఉన్నారు.

ఘనంగా రమేశ్ బాబు జన్మదిన వేడుకలు

రమేశ్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వినోద్ కుమార్

సిరిసిల్ల టౌన్/ వేములవాడ, ఫిబ్రవరి 3: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు జన్మదిన వేడుకలు శనివారం వేములవాడ సంగీతం నిలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్లు మాధవి, కళ, జగిత్యాల జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీలు వజ్రమ్మ, రేవతి, జడ్పీటీసీ మీనయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, లోక బాపురెడ్డి తదితరులు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మైనార్టీ గురుకుల పాఠశాల స్థల పరిశీలన

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 3: మర్రిపల్లిలో మైనార్టీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సర్వర్ మియా, ప్రిన్సిపాల్ రాజేశ్ శనివారం పరిశీలించారు. ఇక్కడ ఉపాధ్యాయులు పూర్ణచందర్, ఉస్మాన్‌షాఖాన్ ఉన్నారు.

సీహెచ్‌సీ నుంచి ముగ్గురికి 'నర్సింగ్ ఆఫీసర్స్'

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు నర్సింగ్ ఆఫీసర్స్‌గా ఉద్యోగాలు సంపాదించారు. సిరిసిల్ల ఇందిరానగర్‌కు చెందిన లావణ్య ఐదేండ్ల నుంచి పీహెచ్‌సీలో ఎన్సీడీగా, కరీంనగర్‌కు చెందిన సుజాత రెండేండ్ల నుంచి ఎంసీహెచ్‌గా, వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన మమత ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్నారు. గత ఆగస్టులో రాత పరీక్షల్లో నిర్వహించగా జనవరి 28న విడుదలైన ఫలితాల్లో వీరు ఉద్యోగాలు సాధించారు.

పశు పోషణను పెంపొందించుకోవాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 3: రైతులు పశు పోషణను పెంపొందించుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణధికారి శ్రీధర్ సూచించారు. బావుసాయిపేటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, కరీంనగర్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 54 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేశారు. 21 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఇక్కడ మండల పశువైద్యాధికారి అంజిరెడ్డి, సూపర్‌వైజర్లు రాములు, ముత్యం రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చందుర్తి,ఫిబ్రవరి 3: రామన్నపేటలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏరెడ్డి రాజిరెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి శనివారం ప